సాక్షి
కుమురం భీం

శుక్రవారం । 23 । మే । 2025



విత్తన ఎంపికే కీలకం

వానాకాలం సీజన్‌లో రైతులు అనువైన వరి వంగడాలను సాగు చేసుకోవాలని కేవీకే శాస్త్రవేత్త శివకృష్ణ సూచించారు. వలు వరి వంగడాల గురించి వివరించారు. 8లో▸



ఆకట్టుకునేలా..

కెరమెరి మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 90 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. బోధన, బోధనేతర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.4 /25.5

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో చాటాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బోధన మెరుగుపర్చుకోవాలి



మాట్లాడుతున్న శ్రీనివాసచారి

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయులు బోధన తీరు మెరుగుపర్చుకోవాలని శిక్షణ ప్రత్యేకాధికారి, అదనపు డైరెక్టర్ శ్రీనివాసచారి అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి గురువారం డీఈవో యాదయ్యతో కలిసి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలన్నారు. ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్‌లు శ్రీనివాస్, అబిద్, జిల్లా సైన్స్ అధికారి మధుకర్, శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి రమేశ్, రిసోర్స్‌పర్సన్ అనురాధ పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం



జిల్లా కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో గురువారం ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొత్తం ఏడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం నిర్వహించిన మొదటి సంవత్సరం పరీక్షకు జనరల్ విభాగంలో 551 మంది విద్యార్థులకు 511 మంది హాజరు కాగా, ఒకేషనల్ విభాగంలో 53 మందికి 42 మంది హాజరయ్యారు. మొత్తం 604 మందికి 553 మంది పరీక్షలు రాయగా, 51 మంది గైర్హాజరయ్యారు. సెకండియర్ పరీక్షకు జనరల్ విభాగంలో 201 మందికి 189 మంది హాజరు కాగా, ఒకేషనల్ విభాగంలో 11 మందికి 8 మంది హాజరయ్యారు. మొత్తం 212 మందికి 197 మంది పరీక్ష రాయగా, 15 మంది గైర్హాజరయ్యారని డీఐఈవో కళ్యాణి తెలిపారు. కాగజ్‌నగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, వసుంధర కళాశాలను తనిఖీ చేశారు.

ఏఎస్పీ ప్రభాకర్‌రావు బదిలీ

ఆసిఫాబాద్‌అర్బన్: ఏఎస్పీ ప్రభాకర్‌రావును వరంగల్‌కు అదనపు డీసీపీ(ట్రాఫిక్)గా బదిలీ చేస్తూ గురువారం ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. 2024 మార్చి 11న జగిత్యాల జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఆయన 14 నెలలపాటు జిల్లాలో విధులు నిర్వర్తించారు. అయితే ఏఎస్పీ స్థానంలో మరొకరిని నియమించలేదు.

స్కావెంజర్ల వేతనాలు విడుదల చేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న అబ్దుల్ లతీఫ్

రెబ్బెన/ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసిన స్కావెంజర్లకు పెండింగ్ వేతనాలు విడుదలయ్యేలా చూడాలని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ లతీఫ్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారితోపాటు డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గత విద్యాసంవత్సరంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించామన్నారు. ప్రారంభంలో మూడు నెలల వేతనాలు మాత్రమే విడుదల చేసి, ఆపై అందించలేదని తెలిపారు. ఐదు నెలల వేతనాలు విడుదల చేయాలని కోరారు. అలాగే జిల్లాలోని 50 జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో సమ్మర్ కోచింగ్ క్యాంపులు ఏర్పాటు చేశామని, శిక్షకులకు రూ.3వేల చొప్పున పారితోషకం ప్రభుత్వం నుంచి అందాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ వీరశంకర్, అసోసియేట్ అధ్యక్షుడు పర్ష చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి దంపతులు

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో గురువారం హనుమాన్ జయంతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకుడు ఒజ్జల శిరీష్‌శర్మ గణపతిపూజ, స్వస్తి పుణ్యాహవచనము, నవగ్రహారాధన, రుద్రాభిషేకం, ఫల, పత్ర, పుష్పార్చన, మంగళహారతి, మహా మంత్రపుష్పం, మహాదాశీర్వచనం, తీర్థప్రసాద వితరణ చేశారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి దంపతులు, అదనపు కలెక్టర్ డేవిడ్ దంపతులు, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్, నాయకులు బాలేశ్‌గౌడ్, మల్లేశ్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.



పూజలు చేస్తున్న భక్తులు



గురువారం బెల్లంపల్లి పట్టణంలో నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

కొలువుల పేరిట టోకరా!



- స్కూళ్లు, కాలేజీలు, హాస్టళ్లలో ఓ సంస్థ నియామకాలు
- రూ.లక్షలు కట్టి నెలల తరబడి డ్యూటీ చేసిన వైనం
- జీతం లేక మోసపోయామని తెలుసుకున్న నిరుద్యోగులు
- ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో అనేక మంది బాధితులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: విద్యాశాఖలో ఉద్యోగాల పేరిట కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో నిరుద్యోగులను ఓ సంస్థ నట్టేట ముంచింది. గత ఏడాది జూన్ విద్యాసంవత్సరం ఆరంభంలోనే ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీలు, గురుకులాల్లో ఉద్యోగాలు కల్పిస్తామంటూ ఆశ చూపి రూ.లక్షలు వసూలు చేసింది. కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో 'విద్యాంజలి 2.0' పథకం అమలవుతోంది. ఈ పథకం కింద ఓ స్వచ్ఛంద సంస్థ స్కూల్, కాలేజీ, వసతిగృహాల్లో సిబ్బంది నియామకాలంటూ పలు రకాలుగా ప్రచారం చేసి ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు వసూలు చేసింది. స్వీపర్ నుంచి టీచింగ్ స్టాఫ్, కంప్యూటర్ ఆపరేటర్, ఏఎన్ఎంలు, వాచ్‌మెన్, వంటమనుషులు పలు రకాల పోస్టులు ఉన్నాయని, వేతనం నెలకు రూ.10వేల నుంచి రూ.18వేల వరకు ఉంటుందని నమ్మబలికింది. దీంతో విద్యాశాఖలో నిజంగానే ఉద్యోగాలుగా భావించి అనేకమంది అప్పులు చేసి మరీ ఉద్యోగాల్లో చేరారు. వీరితో మరికొంతమందిని చేర్చారు. నెలలు గడుస్తున్నా వారికి జీతాలు రాకపోవడంతో అసలు కథ బయటపడింది. అనుమానం వచ్చి నిలదీయడంతో సంస్థ నుంచి ఎలాంటి స్పందన లేదు. దీంతో తాము మోసపోయామని తెలుసుకున్నారు. అప్పటికే పది నెలల దాక పని చేయడం గమనార్హం.



ఇటీవల కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బాధితులు

ఎలా చేర్చుకున్నారో..?


విద్యాశాఖతో సంబంధం లేని ఓ ప్రైవేటు సంస్థ ఆయా స్కూళ్లు, కాలేజీలు, వసతిగృహాల్లో సిబ్బందిని నియమించుకోవాలని చెబితే సంబంధిత బాధ్యులు ఎలా చేర్చుకున్నారనేది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. స్కూళ్ల హెచ్‌ఎంలు, కాలేజీల ప్రిన్సిపాళ్లు, హాస్టళ్ల ఇన్‌చార్జీలు సిబ్బందితో నెలల తరబడి విధులు నిర్వర్తించుకున్నారు. వారి కోసం ప్రత్యేకంగా ఆయా చోట్ల రిజిస్టర్లు పెట్టి హాజరు సైతం తీసుకున్నారు. తీరా జీతం కోసం అడిగితే ఆ సంస్థ చేర్చుకోమని చెబితే విధుల్లోకి తీసుకున్నామని సంబంధిత విద్యాధికారులు అంటున్నారు. అధికారులను సైతం ఆ సంస్థ ఏదైనా ప్రలోభాలకు గురి చేసిందా? అనే ప్రశ్నలు తలెత్తున్నాయి. మరోవైపు విద్యాంజలి పథకం తమ విద్యాసంస్థలో అమలవుతుందా? లేదా? జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి తెలుసుకోకుండానే సిబ్బందిని ఎలా విధుల్లోకి తీసుకున్నారనేది సందేహాలకు తావిస్తోంది. వాస్తవానికి ఈ పథకం ఎంపిక చేసిన చోట్ల, స్వచ్ఛందంగా ఎలాంటి జీతభత్యాలు చెల్లించకుండా నిర్వహించేది. దీని గురించి అవగాహన లేక ఓ సంస్థ చెప్పిన అబద్ధాన్ని నమ్మేస్తూ ఆర్థికంగా నష్టపోయారు.

రూ.లక్షల్లో వసూళ్లు

కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో వంద మంది వరకు బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే చాలామంది బయట చెప్పుకుంటే అవమానంగా భావించి వివరాలు వెల్లడించడం లేదు. మంచిర్యాల జిల్లాలో ఇద్దరు మధ్యవర్తులుగా పని చేసి రెండు జిల్లాల నుంచి అనేక మందిని చేర్పించారు. ఆసిఫాబాద్, రెబ్బెన, కాగజ్‌నగర్, మంచిర్యాల, బెల్లంపల్లి తదితర చోట్ల బాధితులు ఎక్కువగా ఉన్నారు. ఒక్కొక్కరి నుంచి కనీసం రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు వసూలు చేశారు. గతేడాది ఈ సంస్థ నిరుద్యోగులను మభ్యపెడుతున్న తీరుపై 'సాక్షి'లో కథనం ప్రచురించగా, కొందరు చేరేందుకు వెనుకాడారు. అయినా డబ్బులు వస్తున్నాయని, కమీషన్ల ఆశతో సంస్థ సీఈవోగా ఉన్న ఓ వ్యక్తి, ఆయన కింద జిల్లా కో ఆర్డినేటర్లు, ఇన్‌చార్జీలు నమ్మిస్తూ అందరినీ బురిడీ కొట్టించి రూ.కోట్లు వసూలు చేసి పరారయ్యారు. ఇంతా జరిగినా బాధితులు ఎక్కడా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేయడం లేదు. కానీ నమ్మి డబ్బులు పెట్టిన వారి ఇంటికి వెళ్లి గొడవలు చేస్తున్నారు. ఇటీవల కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. మధ్యవర్తులు సైతం ఆ సంస్థను నమ్మి నిండా మునిగామని, తమ వద్ద కూడా డబ్బులు లేవని వాపోతున్నారు.

మెమో ఇచ్చినా.. అదే తీరు!

- కాగజ్‌నగర్ సబ్ డివిజన్‌లో చర్చనీయాంశంగా ఓ పోలీసు అధికారి వ్యవహారం
- ఇసుక, పశువుల వ్యాపారులతో మాటామంతి
- 'సాక్షి' కథనాలపై చర్చ



సాక్షి, ఆసిఫాబాద్: శాంతి భద్రతలకు ఆయన ప్రాధాన్యం ఇవ్వాలి. ఇసుక, జూదం, పశువుల అక్రమ రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలి. కానీ కాగజ్‌నగర్ పోలీస్ సబ్‌డివిజన్‌లో పనిచేస్తున్న సదరు అధికారి మాత్రం అందుకు భిన్నంగా అక్రమార్కులతో చేతులు కలపడం పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఆ అధికారికి జిల్లా ఎస్పీ వార్నింగ్ మెమో జారీ చేసినా అతని పనితీరులో ఎలాంటి మార్పు రాకపోవడం గమనార్హం.

వార్నింగ్ మెమో..

పశువుల అక్రమ రవాణా కట్టడిలో అక్రమార్కులకు అండగా ఉంటున్నారనే నివేదికల నేపథ్యంలో కాగజ్‌నగర్ డివిజన్‌లో పనిచేస్తున్న ఆ పోలీసు అధికారికి జిల్లా ఎస్పీ వార్నింగ్ మెమో ఇచ్చారు. మరోమారు ఇది పునరావృతం అయితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అయినా అధికారి తీరులో మార్పు రాలేదని నిఘా వర్గాలు గుర్తించినట్లు సమాచారం. ఇప్పటికే నివేదికలు ఉన్నతాధికారులకు చేరినట్లు తెలుస్తోంది. దీంతో పాటు ఈ డివిజన్‌లో పనిచేస్తున్న మరికొంత మంది అధికారులపై త్వరలోనే చర్యలు ఉండనున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

యథేచ్ఛగా అక్రమాలు

కాగజ్‌నగర్ నియోజకవర్గంలోని ఓ కీలక పోలీసు స్టేషన్‌కు ఆయన బాస్. ఆ స్టేషన్ పరిధిలో పశువుల అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. ఇసుక దందా.. జూదం సరేసరి. క్వారీల నుంచి నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా కంకర తరలించే లారీల సంగతి చెప్పనక్కరలేదు. ఆయన సర్కిల్ స్టేషన్ బాధ్యతలు చేపట్టిన కొన్ని నెలలకు ఆదాయ మార్గాలను బాగా అన్వేషించి.. వ్యాపారులపై దాడులు చేసి హడావుడి చేశారు. ఆ తర్వాత అక్రమార్కులు ఎవరెవరు ఎంత ముట్టజెప్పాలన్న విషయంలో వారి మధ్య ఓ ఒప్పందం జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. ఆ ఒప్పందంలో భాగంగానే పశువులను అక్రమంగా తరలించే వ్యక్తులు, ఇసుక రవాణాదారులు ఆ పోలీసు అధికారికి ప్రతినెలా రూ.15 లక్షల వరకు మామూళ్లు అందిస్తున్నట్లు తెలుస్తోంది. కంకర వ్యాపారుల నుంచి ఆ అధికారికి నెల మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఎప్పుడైనా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే నలుగురు, ఐదుగురిపై కేసులు నమోదు చేసి మమా అనిపించేస్తున్నారని అక్కడ పనిచేసే పోలీసువర్గాలు బాహాటంగానే చర్చించుకోవడం గమనార్హం.

'సాక్షి' కథనాలపై చర్చ

ఈ నెల 16న 'సాక్షి'లో 'ఖాకీకి అవినీతి మరక' అనే శీర్షిక పేరిట ఒక కథనం ప్రచురితమైంది. దీనిపై పోలీసు జిల్లా బాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అదే రోజు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్న సదరు పోలీసు అధికారి ట్రాక్టర్ యజమానులు, పశువుల అక్రమ రవాణా వ్యాపారులతో మాట్లాడారు. 'సాక్షి'లో ప్రచురితమైన కథనాన్ని సెల్‌ఫోన్‌లో చూపి 'మాది ఫ్రెండ్లీ పోలీసింగే.. కానీ 'సాక్షి'లో కథనం వచ్చింది. కాబట్టి పై అధికారులకు మేము సమాధానం చెప్పాల్సి ఉంటుంది. అందుకే ఇసుక, పశువుల అక్రమ రవాణాపై దాడులు చేస్తున్నాం.' అని స్పష్టం చేసినట్లు సమాచారం. అలాగే ఇటీవల పట్టుకున్న ట్రాక్టర్లను వదిలేయాలని కోరుతూ బుధవారం కొందరు ట్రాక్టర్ యజమానులు అటు తహసీల్దార్‌ను, ఇటు పోలీసు అధికారులను కలిసి వేడుకోగా.. ఇదిగో ఈ రోజు కూడా 'సాక్షి'లో 'ఇసుక దందా' పేరిట కథనం వచ్చింది. మీ ట్రాక్టర్లను వదలడం కుదరదని చెప్పినట్లుగా తెలుస్తోంది.

మహనీయుల చరిత్ర భావితరాలకు అందించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: మహనీయుల చరిత్ర, వారి త్యాగాలను భావితరాలకు అందించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం భాగ్యరెడ్డి వర్మ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమశాఖ జిల్లా అధికారి సజీవన్, వివిధ కుల సంఘాల నాయకులతో కలిసి భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ అణగారిన వర్గాల శ్రేయస్సు కోసం కృషి చేసిన బాంధవుడు భాగ్యరెడ్డి వర్మ అని కొనియాడారు. కుల సంఘాల నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, రేగుంట కేశవ్‌రావు, అలీబిన్ అహ్మద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ

అణగారిన వర్గాల కోసం ఎనలేని కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ అని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. భాగ్యరెడ్డి వర్మ జయంతి సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ సమసమాజ నిర్మాణం కోసం పోరాటం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీపీవో ఏవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంటీఏ ఆర్ఐ అంజన్న, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, మహిళా ఎస్సై లావణ్య, ఆర్ ఎస్సై రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు, నాయకులు

అర్హులకే 'రాజీవ్ యువవికాసం'

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌అర్బన్/ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో అర్హులైన వారికి రాజీవ్ యువవికాసం పథకం వర్తింపజేస్తామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి, జెడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సజీవన్, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ రాజేశ్వర్‌జోషితో కలిసి గురువారం వెరిఫికేషన్, బ్యాంక్ సిబిల్ స్కోర్ పరిశీలన ప్రక్రియపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను క్షుణ్నంగా పరిశీలించి అర్హులను ఎంపిక చేయాలన్నారు. సిబిల్ స్కోర్ పరిశీలనలో బ్యాంకర్లు నిబంధనలు పాటించాలని సూచించారు. అనంతరం ఆసిఫాబాద్ మండలం గుండి గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించి పురోగతిపై సమీక్షించారు. గ్రామంలో ప్రత్యేక నిధుల కింద మంజూరైన పనులు వేగవంతం చేయాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగ్‌రావు, ఎంపీడీవో శ్రీనివాస్, మండలస్థాయి అధికారులు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

లారీలు రాక.. ధాన్యం కదలక



అకాల వర్షానికి మొలకలు వచ్చిన వరి ధాన్యాన్ని చూపుతున్న ఈ రైతు పేరు పోతురాజుల సుగుణాకర్. భీమిని మండలంలోని కేస్లాపూర్ గ్రామం. దహెగాం మండలం బొర్లకుంట శివారు సుమారు ఎనిమిది ఎకరాల్లో దొడ్డురకం వరి సాగు చేశాడు. కోతలు పూర్తయిన తర్వాత బొర్లకుంటలో వారం రోజులు ఆరబెట్టి.. పదిరోజుల క్రితం దహెగాం కొనుగోలు కేంద్రానికి తరలించాడు. మూడు రోజుల క్రితం అకాల వర్షానికి వడ్లు తడిసాయి. బుధవారం మరోసారి తడవడంతో మొలకలు కూడా వచ్చాయి. 'ప్రైవేటుకు అమ్ముకున్నా మంచిగ ఉంటుండే.. సర్కారు కేంద్రంలో అమ్మితే ధర వస్తదని అనుకుంటిని.. వానతో ఇరవై బస్తాల వరకు నష్టం వాటిల్లింది..' అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ఇలా.. కొనుగోళ్లలో జాప్యం కారణంగా జిల్లా రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

- మిల్లులకు తరలించడంలో జాప్యం
- కొనుగోలు కేంద్రాల్లో తడుస్తున్న వడ్లు



దహెగాంలోని కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యం బస్తాలు

దహెగాం(సిర్పూర్): జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలు రైతాంగాన్ని నిండా ముంచుతున్నాయి. సోమవారం కురిసిన వర్షంతో ధాన్యం ఓసారి తడిసిపోగా, బుధవారం మరోసారి కురిసిన భారీ వర్షానికి మరోసారి తడిసింది. కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండటంతో వడ్లు కొనుగోలు కేంద్రాల్లోనే మొలకలు వస్తున్నాయి. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఓ వైపు జిల్లా ఉన్నతాధికారులు ప్రతిరోజూ కేంద్రాలను తనిఖీ చేస్తూ నిర్వాహకులకు చెబుతున్నారు. కానీ కాంటా పూర్తయిన తర్వాత బస్తాలు మిల్లులకు తరలించడానికి లారీలు పంపించడంలో శ్రద్ధ చూపడం లేదు. తరలించిన ధాన్యాన్ని సైతం మిల్లర్లు త్వరగా అన్‌లోడ్ చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. చిన్నపాటి జల్లులు పడినా ధాన్యం పంపకండి అంటూ కొర్రీలు పెడుతున్నారని వాపోతున్నారు.

10 మిల్లులకు ధాన్యం..

జిల్లాలో 20వేల ఎకరాల్లో వరి సాగు చేయగా, కొనుగోళ్ల కోసం 34 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 55 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం చేతికొచ్చే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేయగా, పౌరసరఫరాల శాఖ 10 వేల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఇప్పటి వరకు 3,500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న పది మిల్లులకు ధాన్యం తరలిస్తున్నారు. గురువారం మన జిల్లాలోనే కాకుండా పెద్దపల్లిలోని మిల్లులకు సైతం ట్యాగింగ్ ఇచ్చి వడ్లు తరలించారు. బుధవారం కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలను సైతం పంపించారు. అయితే అక్కడి మిల్లుల నిర్వాహకులు ఏమైనా కోత విధిస్తారా.. అనే సందేహం రైతుల్లో నెలకొంది. తేమ శాతం పెరిగే అవకాశం ఉండటంతో ఎలాంటి కొర్రీలు విధిస్తారో అంటూ చర్చించుకుంటున్నారు. షరతులు లేకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి వరకు వర్షం పడగా, మరో మూడు రోజులపాటు పడే అవకాశం ఉండటంతో కొనుగోళ్లు వేగవంతం చేయాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: అకాల వర్షాల నేపథ్యంలో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో అకాల వర్షం, ధాన్యం కొనుగోళ్లు, ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధం అంశాలపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మరో రెండు, మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. జనజీవనానికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావు కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాలు, వాగుల వైపు ఎవరూ వెళ్లకుండా భద్రతా చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో 34 కొనుగోలు కేంద్రాలతోపాటు మరో మూడు అదనంగా ఏర్పాటు చేశామని తెలిపారు. ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలిస్తున్నామన్నారు. ఖరీఫ్‌లో విత్తనాలు, యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. డీఆర్‌డీవో దత్తారావు, డీపీవో భిక్షపతిగౌడ్, డీఎస్‌వో వినోద్, మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

'విద్యుత్ శాఖలో సింగిల్ విండో వ్యవస్థ'

ఆసిఫాబాద్‌అర్బన్: హెచ్‌టీ, 11 కేవీ, 33 కేవీ, ఆపై ఓల్టేజీ సర్వీసుల మంజూరు ప్రక్రియను వేగవంతం చేసేందుకు విద్యుత్ శాఖలో సింగిల్ విండో వ్యవస్థకు శ్రీకారం చుట్టినట్లు ఆసిఫాబాద్ సర్కిల్ ఎస్‌ఈ రాథోడ్ శేషారావు ఒక ప్రకటనలో తెలిపారు. సర్వీసుల మంజూరును సరళీకృతం చేసేందుకు సర్కిల్ కార్యాలయం, కార్పొరేట్ కార్యాలయంలో మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేశామన్నారు. 11 కేవీ దరఖాస్తులను సర్కిల్ కార్యాలయం ఏడీఈ కమర్షియల్ అధికారి పరిశీలిస్తారని, 33 కేవీ, ఆపై ఓల్టేజీకి సంబంధించిన దరఖాస్తులను ఏఈడీ కమర్షియల్ కార్పొరేట్ కార్యాలయ అధికారి పరిశీలిస్తారని తెలిపారు. వినియోగదారులు మొదట టీజీఎన్‌పీడీసీఎల్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సింగిల్ విండో వ్యవస్థతో సర్వీసుల మంజూరు వేగంగా పూర్తవుతుందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

వైన్‌షాప్‌లో చోరీ

నస్పూర్: పట్టణ పరిధిలోని తెలంగాణ చౌరస్తా వద్ద గల ఓ వైన్‌షాప్‌లో చోరీ జరిగింది. మంగళవారం రాత్రి షాపు మూసి ఇంటికి వెళ్లామని, బుధవారం ఉదయం వచ్చి చూసేసరికి షెట్టర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించామన్నారు. షాపులోని సుమారు రూ.12వేల నగదు అపహరణకు గురైనట్లు తెలిపారు.

అటవీశాఖ అదుపులో అనుమానితులు

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ రేంజ్ పరిధిలోని ఎల్లూర్ అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలతో పెద్దపులిని హతమార్చిన ఘటనలో పలువురిని అటవీశాఖ అధికారులు గురువారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. అగర్‌గూడ గ్రామానికి చెందిన ఒకరిని, కోయచిచ్చాలకు చెందిన ఇద్దరు అనుమానితులను అదుపులో తీసుకుని విచారణ జరుపుతున్న అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. అటవీశాఖ కస్టడీలో ఉన్న నిందితులు ఇస్తున్న సమాచారంతో అటవీశాఖ అధికారులు అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నారు. పెంచికల్‌పేట్ మండలంలోని అగర్‌గూడ, ఎల్లూర్, కోయచిచ్చాల, పెంచికల్‌పేట్ గ్రామాలకు చెందిన సుమారు 13 మందిని విచారిస్తున్నారు.

రహదారిపై నిలిపిన భారీ వాహనాలకు జరిమానా

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై ఎలాంటి కారణం లేకుండా నిలిపి ఉంచిన భారీ వాహనాలకు గురువారం ఎస్సై స్వరూప్‌రాజ్ జరిమానా విధించి డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. రహదారులపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా వాహనాలు నిలిపి ఉంచడం వలన తరచూ ప్రమాదాలు జరుగుతూ ప్రాణనష్టం సంభవిస్తున్నాయన్నారు. ఇకపై రహదారులపై అత్యవసర పరిస్థితుల్లో వాహనం ఆపాల్సి వస్తే పార్కింగ్ లైట్లు వేసి రెడ్ ట్రయాంగిల్ స్టాండ్ ఏర్పాటు చేస్తూ రహదారిపై ఉండి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు, క్లీనర్లు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై సూచించారు.

కిరాణా దుకాణం సీజ్

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అమ్మ గార్డెన్ సమీపంలో గల ఓ కిరాణ దుకాణంలో కాలం చెల్లిన వస్తువులు అమ్ముతున్నారనే ఫిర్యాదుతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్, సంతోష్ గురువారం తనిఖీలు నిర్వహించి షాప్‌ను సీజ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు బానేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని కనుకదుర్గ కిరాణ షాపులో బుధవారం గడికొప్పుల లక్ష్మి అనే మహిళ బ్రెడ్ కొనుగోలు చేసింది. దానిని తెరిచి చూడగా బూజుపట్టి ఉంది. అనుమానం వచ్చి కవర్‌పైన ఎక్స్‌పైరీ డేట్ చూడగా ఈ నెల 18వ తేదీ వరకు గడువు ఉంది. దుకాణం నిర్వాహకుడినిగా అడిగితే దురుసుగా ప్రవర్తించడంతో మున్సిపల్ కమిషనర్ గద్దె రాజుకు ఫిర్యాదు చేయగా తనిఖీ చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. గురువారం షాపులోకి వెళ్లి చూడగా కొన్ని తినుబండారాలు కాలం చెల్లినవి ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకుని షాపు సీజ్ చేశారు.

విత్తన ఎంపికే కీలకం

- రైతులు సరైన వరి వంగడాలు ఎంచుకోవాలి
- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ

బెల్లంపల్లి: వానాకాలం సమీపిస్తోంది. మరో పక్షం రోజుల్లోగా ఖరీఫ్ సీజన్ ఆరంభం కానుంది. ఇప్పటికే అల్పపీడనంతో వర్షాలు కురుస్తున్నాయి. ఈనెల 25 నుంచి రోహిణి కార్తె మొదలు కానుంది. ఈ మేరకు రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్నారు. వానాకాలం సీజన్‌లో రైతులు అనువైన వరి వంగడాలను సాగు చేసుకోవాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్, శాస్త్రవేత్త కోట శివకృష్ణ సూచిస్తున్నారు. పంట దిగుబడి, చీడపీడలు తట్టుకునే గుణం కలిగిన వరి వంగడాల గురించి వివరించారు.

వరి రకాలు

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయడానికి అనువైన వరి వంగడాలు దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్ప కాలిక రకాలు ఉన్నాయి. దీర్ఘకాలిక రకం (150 రోజులు). ఈ రకం వంగడాలను జూన్ నెలాఖరు వరకు నాటుకోవాలి. మధ్యకాలిక రకాలు (135–140 రోజులు). జులై 15 వరకు నాటుకోవాలి. స్వల్పకాలిక రకాలు (120–125రోజులు) జులై చివరి వరకు నార్లు పోసుకుని 25 రోజుల్లోపు నాట్లు వేయాలి.



సాగు చేసిన కూనారం సన్నాల వరి పంట (ఫైల్)

శివకృష్ణ, శాస్త్రవేత్త

స్వల్పకాలిక రకాలు

తెలంగాణ వరి–4 (జేజీఎల్–25958): ఈ రకం వంగడం స్వల్పకాలిక దొడ్డు గింజ రకం. 115 నుంచి 120 రోజుల్లో పంట కోతకు వస్తుంది. హెక్టారుకు 65 క్వింటాళ్ల నుంచి 70 క్వింటాళ్ల దిగుబడి ఇస్తుంది.

కూనారం వరి–2 (కేఎన్ఎం–1638): 120 నుంచి 125 రోజుల్లో పంట కోతకు వస్తుంది. హెక్టార్‌కు 76 నుంచి 85 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఉల్లికోడు, బయోటైప్–3, అగ్గి తెగులును సమర్థవంతంగా తట్టుకుంటుంది.

బతుకమ్మ: హెక్టారుకు 70 క్వింటాళ్ల నుంచి 80 క్వింటాళ్ల పంట దిగుబడిని ఇస్తుంది. 115 నుంచి 120 రోజుల్లో పంటచేతికి వస్తుంది. ఎండాకు తెగులు, సుడిదోమ, పచ్చదోమ తట్టుకుంటుంది. విత్తన నిద్రావస్థ మూడు వారాలు ఉంటుంది. గింజ రాలేగుణం తక్కువ.

జగిత్యాల రైస్(జేజీఎల్–24423): 120 నుంచి 125 రోజుల్లో పంట చేతికి వస్తుంది. హెక్టార్‌కు 85 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఉల్లికోడు, సుడిదోమ, గో ధుమ రంగు, ఆకుపచ్చ తెగులును కొంతవరకు తట్టుకుంటుంది. గింజ రాలేగుణం తక్కువ. చేను నే లపై పడిపోదు. విత్తన నిద్రావస్థ రెండు వారాలు ఉంటుంది.

మధ్యకాలిక రకాలు

వరంగల్ రైస్–1 (డబ్ల్యూజీఎల్–915): ఈ రకం వంగడం పొడవు, దొడ్డు, గింజనాణ్యత కలిగి ఉంటుంది. అటుకులు, మరమరాల (పేలాలు) తయారీకి అనువైనరకం. 135 రోజులకు కోతకు వస్తుంది. వానాకాలం సాగుకు ఈరకం ఎంతో ఉత్తమమైంది. అగ్గి తెగులు, సుడిదోమ, ఎండాకు తెగులును కొంతవరకు తట్టుకుంటుంది. హెక్టార్‌కు 65 నుంచి 70 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

కూనారం సన్నాలు(కేఎన్ఎం–118): ఈ రకం వంగడం 118 నుంచి 120 రోజుల్లో పంట కోతకు వస్తుంది. హెక్టార్‌కు 70 క్వింటాళ్ల నుంచి 80 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అగ్గి తెగులు, మెడ విరుపు తెగుళ్లను తట్టుకుంటుంది. సుడిదోమను కొంతవరకు నివారిస్తుంది.

తెలంగాణ వరి–2 (డబ్ల్యూజీఎల్–697): ఈరకం వంగడం పంటకాలం 135 రోజులు. సన్నగింజ, నాణ్యతతో ఉంటుంది. హెక్టార్‌కు 65 నుంచి 70 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. సుడిదోమ, అగ్గి తెగులు, పొట్టకుళ్లు తెగులును తట్టుకుంటుంది.

సోమనాథ్: ఈ రకం వంగడం 130 నుంచి 135 రోజులకు పంట చేతికి వస్తుంది. హెక్టార్‌కు 65 నుంచి 70 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తుంది. సన్న గింజరకం. ఉల్లికోడును తట్టుకుంటుంది. అగ్గితెగులును కొంతవరకు తట్టుకునే శక్తి ఉంటుంది. నారుమడి దశలో కొంతవరకు చలిని సైతం తట్టుకుంటుంది.

కంపాసాగర్ వరి (కేపీఎస్ 2874): ఈరకం వంగడం 140 రోజుల్లో పంట చేతికి అందివస్తుంది. అధిక దిగుబడిని ఇస్తుంది. గింజలు సన్నగా ఉంటాయి. సాంబమసూరితో పోలిస్తే పైరు ఎత్తు ఎక్కువగా పెరుగుతుంది. సుడిదోమ, అగ్గి తెగులును కొంతవరకు తట్టుకుంటుంది. హెక్టార్‌కు 65 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

దీర్ఘకాలిక రకాలు

ఇంద్ర (ఎంటీయూ–1061): ఈ రకం వంగడం 160 రోజుల్లో పంట చేతికి వస్తుంది. హెక్టార్‌కు 65 నుంచి 70 క్వింటాళ్ల దిగుబడిని ఇస్తుంది. దోమను తట్టుకుంటుంది. నేరుగా వెదజల్లే పద్ధతిలో సాగు చేయడానికి అనువైనది.

తెలంగాణ సోన (ఆర్ఎన్ఆర్–15048): ఈ రకం వంగడం పంట కాలం 125 రోజులు. హెక్టార్‌కు 65 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అగ్గి తెగులును తట్టుకుంటుంది. అతి సన్నబియ్యం. తక్కువ నూక శాతంతో అన్నం నాణ్యత కలిగి ఉంటుంది. గ్లైమిక్ ఇండెక్స్ తక్కువ.

జగిత్యాల సన్నాలు (జేజీఎల్–1798): ఈరకం వంగడం పంటకాలం 120 రోజులు. హెక్టార్‌కు 70 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఉల్లికోడును తట్టుకునే గుణం ఎక్కువగా ఉంటుంది. సాగుకు అనువైన రక.

సాంబ మసూరి (బీపీటీ–5204): ఈ రకం వంగడం 150 రోజుల్లో పంట చేతికి వస్తుంది. హెక్టార్‌కు 65 క్వింటాళ్ల దిగుబడిని ఇస్తుంది. బియ్యం సన్నగా ఉంటాయి. అన్నం ఎంతో నాణ్యతగా ఉంటుంది. ఏ రకమైన చీడపీడలను తట్టుకోలేదు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

లక్సెట్టిపేట: ఈ నెల 19న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని మోదెల గ్రామానికి చెందిన ఎలగతి శ్రీలత (29)కు అదే గ్రామానికి చెందిన సురేష్‌తో పదేళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. కొద్దిరోజులుగా కూతురు ఆద్యశ్రీ అనారోగ్యానికి గురైంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురైంది. ఈనెల 19న గడ్డిమందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాహానికి వెళ్లి వస్తూ తిరిగిరాని లోకాలకు..

- చెట్టు విరిగిపడి మహిళ మృతి

జన్నారం: బంధువుల ఇంట్లో పెండ్లికి హాజరై ఇంటికి తిరిగి వస్తుండగా ఈదురు గాలులకు చెట్టు విరిగి మీదపడడంతో మహిళ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజవర్దన్ తెలిపిన వివరాల ప్రకారం దండేపల్లి మండలం వెంకటపూర్ గ్రామానికి చెందిన శనిగారపు జగన్, అతని భార్య సునీత (37)తో కలిసి బుధవారం కడెం మండలంలోని లింగపూర్‌లో ఉన్న బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రాత్రి 9 గంటల ప్రాంతంలో జన్నారం మండలం మహ్మదబాద్ గ్రామ సమీపంలోకి చేరుకునే సరికి బలమైన గాలులు వీయడంతో చెట్టు విరిగి సునీతపై పడడంతో బైక్‌పై నుంచి ఇద్దరు కిందపడిపోయారు. తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు లక్సెట్టిపేట ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సునీత అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. జగన్‌ను మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి చెవుల మద్ది శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



సునీత (ఫైల్)

విద్యుదాఘాతంతో ఆవు మృతి

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటలో గోళ్ల తిరుపతికి గల పాడి ఆవు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. మేతకు వెళ్లే సమయంలో రోడ్డు పక్కన ఉన్న ఇనుప స్తంభానికి తగలడంతో షాక్‌కు గురైన ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.50 వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. ఇనుప స్తంభానికి షాక్ వస్తోందని రెండు మూడు రోజులుగా విద్యుత్ సిబ్బందికి చెప్పినా పట్టించుకోలేదని ఆరోపించారు. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందన్నారు. గ్రామంలో గల ఇనుప విద్యుత్ స్తంభాలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

అంజనీతండాలో..

నర్సాపూర్(జి): మండలంలోని అంజనీతండాలో రాథోడ్ దుర్గాదాస్ అనే రైతుకు చెందిన ఆవు గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మృతి చెందింది. దేవుని చెరువు దారిలో ఆవు మేత వేస్తుండగా మినీ ట్రాన్స్ ఫార్మర్ వద్ద ఎర్తింగ్ రాడ్, వైర్లకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఘటన స్థలాన్ని పశు వైద్యాధికారి ముక్తార్ అహ్మద్, విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించి పంచనామా నిర్వహించారు. ఆవు విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని, నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతు కోరుతున్నాడు.



దండేపల్లి: ఆవును చూపిస్తున్న రైతు తిరుపతి

కారులో చెలరేగిన మంటలు

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పార్కింగ్ చేసి ఉన్న కారులో గురువారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అక్కడే కుడి వైపు ఉన్న పాఠశాల గదిలో డీఈవో రామారావుతో శిక్షణ పొందుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయులతో ఎడమ వైపున ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో కలెక్టర్, ఎమ్మెల్యేతో సమీక్షలో పాల్గొన్న అధికారులు, ఇతర కార్యాలయాల అధికారులు ఒక్కసారిగా హైరానా పడ్డారు. కాగా కలెక్టర్ సమీక్షలో పాల్గొన్న సత్తన్‌పల్లి డిప్యూటీ రేంజ్ అధికారి మహేశ్‌కు చెందిన కారుగా గుర్తించారు. కారులోని బ్యాటరీ వైర్లు ఎర్తింగ్ అయి మంటలు చెలరేగినట్లు గుర్తించారు. వెంటనే కారు అద్దాలు పగుల గొట్టి అందులోని బ్యాగులు, ఇతర సామగ్రి బయటకు తీసి అక్కడే అందుబాటులో ఉన్న మినరల్ వాటర్ పోసి మంటలు అదుపు చేయడంతో పాటు ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు పదేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: భార్యను మానసికంగా, శారీరకంగా వేధించి ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్తకు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ జిల్లా అసిస్టెంట్ సెషన్ జడ్జి సీఎం రాజ్యలక్ష్మి గురువారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి ఎ.వెంకటమ్మ తెలిపారు. భోరజ్ గ్రామ సమీపంలో జీఎంఆర్ స్పిన్నింగ్ మిల్లు క్వార్టర్స్ వద్ద నిందితుడు సిడాం హిమంత్‌రావు అతని భార్యతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. నిత్యం భార్యను వేధింపులకు గురిచేస్తుండడంతో 2019 జూన్ 23న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు జైనథ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. కోర్టు డ్యూటీ అధికారి జమీర్ 13 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ శైని సుల్తాన విచారించి నేరం రుజువు చేశారు. ఈ మేరకు జడ్జి తీర్పునిచ్చినట్లు వివరించారు.

విద్యార్థినిని వేధించిన ప్రిన్సిపాల్‌కు ఏడాది జైలు

ఆదిలాబాద్‌టౌన్: దళిత విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రైవేటు స్కూల్ ప్రిన్సిపాల్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.9వేల జరిమానా విధిస్తూ ఆదిలాబాద్ జిల్లా అడిషనల్ జడ్జి శివరాంప్రసాద్ గురువారం తీర్పునిచ్చారు. లైజన్ అధికారి పండరి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా మావల మండల కేంద్రంలోని ప్రైవేటు స్కూల్‌లో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఫని మోహన్‌రావు ఓ మైనర్ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. 2024 జనవరి 3న ప్రిన్సిపాల్ ఆ విద్యార్థిని తన క్యాబిన్‌లోకి పిలిచి దురుసుగా ప్రవర్తించాడు. అప్పటి మావల ఎస్సై వంగ విష్ణువర్ధన్ కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ పోలీసు అధికారి సీహెచ్.సంతోష్ 17 మంది సాక్షులను కోర్టులో హాజరుపర్చారు. పీపీ ప్రవీణ్ కుమార్ నేరం రుజువు చేయగా జిల్లా అదనపు జడ్జి తీర్పునిచ్చినట్లు వివరించారు.

ప్రేమ పేరుతో మోసగించిన యువకుడి అరెస్టు

బాసర: బాసర మండలం కౌట గ్రామానికి చెందిన ఓ యువతిని అదే గ్రామానికి చెందిన గైక్వాడ్ విలాస్ ప్రేమ పేరుతో మోసం చేశాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి.. నిందితుడిని బుధవారం రిమాండ్‌కు తరలించారు. గైక్వాడ్ విలాస్ ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని యువతి వెంట పడ్డాడు. దీంతో ఇద్దరూ కొంత కాలం ప్రేమించుకున్నారు. 20 రోజుల క్రితం పెళ్లి ప్రస్తావన తీసుకురాగా గ్రామం నుంచి వెళ్లిపోయాడు. దీంతో అనుమానం వచ్చిన బాధితురాలు వారం క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు విచారణ చేపట్టిన పోలీసులు బుధవారం గ్రామానికి వచ్చిన గైక్వాడ్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

కేంద్ర ప్రభుత్వ నిధులు పక్కదారి

- ఎంపీ గోడం నగేష్

ఆదిలాబాద్: రాష్ట్రంలోని గిరిజనుల సంక్షేమం కోసం కేంద్రం విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం వాటిని వినియోగించకుండా దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా గిరిజనుల్లో అత్యంత వెనుకబడిన వర్గాలైన చెంచు, కోయ వర్గాల ప్రగతికి సంబంధించిన నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తే రాష్ట్ర ప్రభుత్వం వాటికి ఖర్చు చేయడం లేదని మండిపడ్డారు. ఓవైపు రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు గెలిస్తే ఏమి చేయలేదని విమర్శిస్తూనే, కేంద్రం నుంచి వచ్చిన నిధులను విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. గతేడాది అక్టోబర్‌లో పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలకు సంబంధించి రూ.152 కోట్లు కేంద్రం నుంచి విడుదలైతే ఒక్క రూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదని విమర్శించారు. అక్టోబర్, మార్చి నెలల్లో సుమారుగా కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.397 కోట్లు రాగా, వాటిని విడుదల చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమాన్ని అడ్డుకుంటుందని మండిపడ్డారు. ఈ నెల 25లోగా కేంద్రం విడుదల చేసిన నిధులు అన్నింటినీ రిలీజ్ చేయాలని, లేనిచో గిరిజన సంఘాలతో కలిసి ఒత్తిడి తీసుకువస్తామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, నాయకులు అస్తక్ సుభాష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేష్

ఇందిరమ్మ ఇళ్లకు 'ఐఎఫ్‌ఎస్‌సీ' సమస్య

- పలు బ్యాంకులకు మారిన కోడ్‌లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు డబ్బులు జమ చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో బ్యాంకుల ఐఎఫ్ఎస్సీ కోడ్‌లు మారడంతో తిప్పలు తప్పడం లేదు. ముఖ్యంగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఖాతాలు ఉన్న లబ్ధిదారులకు ఈ సమస్యలు ఏర్పడుతున్నాయి. వీటితోపాటు గతంలో ఆంధ్రాబ్యాంకు, ఎస్‌బీహెచ్, తదితర విలీన బ్యాంకులుగా ఉన్న పాత ఖాతాలే ఇచ్చిన చోట్ల సమస్యలు ఉన్నాయి. సర్వే జరిపినప్పుడు పాత కోడ్‌లే ఉండడంతో అవే వివరాలు అందించారు. ఇటీవల మంచిర్యాల జిల్లాలో పలువురు లబ్ధిదారులకు గృహ నిర్మాణ శాఖ నుంచి డబ్బులు విడుదల చేస్తున్నప్పటికీ ఖాతాల్లో జమ కావడం లేదు. దీంతో నిరుపేదలు ఇళ్లు కట్టుకునేందుకు జాప్యం జరుగుతోంది. పునాదుల దశలో ఉన్న వారికి రూ.లక్ష జమ చేస్తున్న నేపథ్యంలో ఈ సమస్య తీర్చాలని లబ్ధిదారులు కోరుతున్నారు. రాష్ట్రంలో ఇదే తీరుగా పలు జిల్లాల్లోనూ ఈ సమస్య ఉత్పన్నమైనప్పటికీ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలను మార్చేలా అవకాశం లేక ఇళ్ల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. దీనిపై మంచిర్యాల హౌసింగ్ కార్పొరేషన్ పీడీ బాన్సీలాల్‌ను 'సాక్షి' వివరణ కోరగా, ఉన్నతాధికారులకు నివేదించామని ఎంపీడీవోలకు ఎడిట్ ఆప్షన్ ఇస్తే సమస్య తీరుతుందని తెలిపారు.

మూడు తరాల నుంచి భూదానం

- వారసత్వంగా భూమిని దానం చేస్తున్న కుటుంబం

సాత్నాల: తాత నుంచి మనవళ్ల వరకు భూదానం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది భోరజ్ మండలంలోని గిమ్మ గ్రామానికి చెందిన నాలం కుటుంబం. ఊరి కోసం తమవంతు సాయంగా లక్షల రూపాయల విలువచేసే భూమిని విరాళంగా అందించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. భోరజ్ మండలంలోని జాతీయ రహదారికి ఐదు కిలో మీటర్ల దూరంలో గిమ్మ గ్రామం ఉంది. గ్రామానికి చెందిన నాలం కుటుంబ సభ్యులు తమ సొంత భూమిలో ఆ ఊరి ప్రజల రాకపోక కోసం తారు రోడ్డు నిర్మాణం కోసం భూమిని వదిలిపెట్టారు. గ్రామంలోని పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పాఠశాల భవనం, వసతిగృహం కోసం, ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఆస్పత్రి, పశువుల కోసం వెటర్నరి ఆస్పత్రి, శ్మశాన వాటిక, రైతువేదిక నిర్మాణానికి ఆరున్నర ఎకరాల భూమిని విరాళంగా అందించారు. తాత నాలం రాములు నుంచి మనవళ్లు నాలం వామన్, నాలం అనిల్ వారసత్వంగా భూదానం చేస్తున్నారు. నాలం రాములు, అతని కుమారుడు వామన్ కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. వామన్ కుమారుడు నాలం అనిల్‌సైతం తనవంతు సహాయ సహకారాలు అందిస్తూ తాత దారిలోనే పయనిస్తున్నాడు.



విరాళం ఇచ్చిన భూమిలో ఏర్పాటు చేసిన ఆస్పత్రి

తోచిన సాయం చేస్తా



మా తాత రాములు, నాన్న వామన్ మదిలో గ్రామాభివృద్ధికోసం ఏదో ఒకటి చేయాలనే తపన ఉండేది. ఊరి కోసం ఆరెకరాల భూమిని అందించారు. నేను కూడా నాకు తోచిన సాయం చేసేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా. ఇటీవల రైతు వేదిక కోసం భూమిని విరాళంగా ఇచ్చాం.

– నాలం అనిల్

పనిచేయని 'ఇరిగేషన్' ఫోన్లు

- తాత్కాలికంగా అందుబాటులో లేదని చెబుతున్న వైనం

దండేపల్లి: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొన్ని సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల ఇరిగేషన్ అధికారుల 91549 సిరీస్‌గల ఫోన్‌నంబర్లు కొద్ది రోజులుగా పనిచేయడం లేదు. ఫోన్‌చేస్తే ఈనంబర్ నందు ఇన్‌కమింగ్ కాల్ సౌకర్యం తాత్కాలికంగా అందుబాటులో లేదని చెబుతోంది. ఇరిగేషన్ అధికారుల డిపార్ట్‌మెంట్ నంబర్లకు రీచార్జ్ చేయక పోవడంతో అవి పనిచేయడం లేదని సమాచారం. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నాయి. ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, ఉప్పొంగితే ఏదైనా ప్రమాదం జరిగితే ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇవ్వాలంటే వారి ఫోన్‌నంబర్లు పనిచేయక పోవడం ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు. బడ్జెట్ లేని కారణంగానే డిపార్ట్‌మెంట్ ఫోన్ నంబర్లకు రీచార్జీ చేయలేదని తెలుస్తోంది. ఉన్నతాధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి ఇరిగేషన్ శాఖ డిపార్ట్‌మెంట్ ఫోన్‌నంబర్లకు రీచార్జ్ చేయించి పనిచేసేలా చేయాలని పలువురు కోరుతున్నారు.

'బూటకపు ఎన్‌కౌంటర్లను ఖండించాలి'

పాతమంచిర్యాల: బూటకపు ఎన్‌కౌంటర్లను ఖండించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2026 నాటికి మావోయిస్టు పార్టీని లేకుండా చేయాలనే ఉద్దేశంతో మోదీ ప్రభుత్వం నరమేధానికి ఒడిగట్టిందన్నారు. ఏడాదికాలంలో 540 మందిని ఎన్‌కౌంటర్ల పేర చంపేశారని, అందులో అమాయకులు, సామాన్య పౌరులు కూడా ఉన్నారన్నారు. ప్రభుత్వం చేస్తున్న ఈ హత్యలపై సుప్రీంకోర్టుచే న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి లాల్ కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్, కార్యదర్శి బ్రహ్మానందం, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి దేవరాజ్, తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంట సత్యం పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

నకిలీ పత్రాలు సృష్టించిన ముగ్గురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: నకిలీ పత్రాలు సృష్టించి ఇంటి స్థలాన్ని కాజేద్దామని పన్నాగం పన్నిన ముగ్గురిపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా మరొకరు పరారీలో ఉన్నారు. గురువారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐ కరుణాకర్‌రావు వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణంలోని మహలక్ష్మివాడలో ఆరె సుదర్శన్‌కు చెందిన ప్లాట్ నకిలీ దస్తావేజులను పవార్ నవనీత్, గంద్రత్ మహేందర్, పడాల చేతన్ కుమార్ సృష్టించారు. కాలనీలోని 122 చదరపు అడుగుల భూమిని కాజేయాలనే ఉద్దేశంతో ఏ–1 నవనీత్ కొనుగోలుదారుడిగా, ఏ–3 పడాల చేతన్ అమ్మిన వ్యక్తిగా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏ–2 గంద్రత్ మహేందర్ సహాయంతో పత్రాలు సృష్టించారు. మున్సిపాలిటీలో డోర్ నంబర్ తీసుకొని అధికారులను మోసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పవార్ నవనీత్, గంద్రత్ మహేందర్‌లను అరెస్టు చేయగా పడాల చేతన్ పరారీలో ఉన్నాడు. నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసే వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. డోర్ నంబర్ ఇచ్చే విధంగా, నకిలీ పత్రాలు సృష్టించే విధంగా ప్రభుత్వ అధికారులు సహకరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సోలార్ ఫెన్సింగ్ దొంగిలించిన వ్యక్తిపై ..

నెన్నెల: సోలార్ ఫెన్సింగ్ దొంగిలించిన మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన కాల్వ సతీశ్‌పై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. గొల్లపల్లికి చెందిన రైతు సరండ్ల భూమయ్య తన పొలం చుట్టూ వేసుకున్న ఫెన్సింగ్‌ను బుధవారం రాత్రి సతీష్ అనే వ్యక్తి దొంగలించాడు. తాగిన మైకంలో తానే దొంగలించానని బోయిని రమేశ్ అనే వ్యక్తితో చెప్పడంతో విషయాన్ని బాధిత రైతు భూమయ్యకు సమాచారం చేరవేశాడు. భూమయ్య గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.